నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 27 మే 2025 | NALGONDA

ఆయకట్టు రైతుల్లో ఆనందం

నిలకడగా మూసీకి ఇన్‌ఫ్లో

కేతేపల్లి, మే 26: ఉమ్మడి జిల్లాలో నాగార్జున సాగర్ తర్వాత రెండో అతిపెద్ద సాగు నీటి వనరైన మూసీ ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం వరకు 637.60అడుగులుగా ఉంది. ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి 800.68 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ఏప్రిల్ మొదటి వారంలో యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదల నిలిపి వేసే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 622.91 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు నెల రోజుల్లో సుమారు 15 అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645(4.46 టీఎంసీలు)అడుగులు కాగా ప్రస్తుతం 637.60(2.69 టీఎంసీలు) అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు నిండుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో లొల్లి

గ్రూపులుగా విడిపోయిన హస్తం నేతలు.. ముదిరిన పాత, కొత్త కాపుల పంచాయితీ

- బయటపడుతున్న అంతర్గత విభేదాలు
- తుంగతుర్తి సమావేశంలో గొడవ
- ఎమ్మెల్యేలు చెప్పినా ఏకగ్రీవానికి ససేమిరా
- కొన్ని మండలాల్లో 20కి పైగా దరఖాస్తులు
- భువనగిరిలో ఇంకా మొదలుకాని ప్రక్రియ
- డీసీసీ అధ్యక్షుడి సమన్వయలోపంతోనే..

కాంగ్రెస్ సంస్థాగత కమిటీల లొల్లి జోరుగా నడుస్తున్నది. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా కొనసాగుతున్నది. పాత-కొత్త నేతల మధ్య పంచాయితీ ముదురుతున్నది. ఎమ్మెల్యేలు, కీలక నేతలు చెప్పినా ఏకగ్రీవానికి ససేమిరా అంటూ కాకరేపుతున్నది. ఒక్కో మండలంలో 20కి పైగా దరఖాస్తులు రావడంతో నువ్వా.. నేనా అన్నట్లు ముందుకు సాగుతున్నది. డీసీసీ అధ్యక్షుడి సమన్వయలోపంతోనే సమస్య జటిలమవుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లో సంస్థాగత కమిటీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నది. 17 మండలాలు, 6 మున్సిపాలిటీలు, ఐదు బ్లాక్ కాంగ్రెస్ పదవులు ఉన్నాయి.

యాదాద్రి భువనగిరి, మే 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అంటేనే అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. సాధారణంగానే గ్రూపులు కడుతుంటారు. ఆ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉండటంతో పదవుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణాలు, మండలాల్లో గ్రూపులు కడుతున్నారు. ఒక్కో మండలంలో నాలుగైదు గ్రూపులుగా చీలి తమకంటే తమకు పదవి ఇవ్వాలని వేడుకుంటున్నారు. దీంతో నేతల మధ్య అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయి. లోలోపల ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ.. దుమ్మెత్తిపోస్తున్నారు. ఏకంగా సోషల్ మీడియాలో తిట్టిపోసుకుంటున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాల ముఖ్య కార్యకర్తలతో ఈ నెల 10న సమావేశం ఏర్పాటు చేయగా, గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మరోసారి సమావేశం నిర్వహించగా అడ్డగూడూరు, మోత్కూరు మండలాల నుంచి ఆరు చొప్పున, మోత్కూరు పట్టణ అధ్యక్షుడి కోసం పది మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో కోఆర్డినేట్ చేయడం తలనొప్పిగా మారింది.

ఏకగ్రీవానికి ససేమిరా..

సంస్థాగత కమిటీలను అందరి అభిప్రాయంతో ఏకగ్రీవం చేయాలని భావించారు. ఇందుకోసం ఆయా చోట్ల పార్టీ కార్యాలయాల్లో పీసీసీ పరిశీలకుడు, డీసీసీ అధ్యక్షుడు సమక్షంలో సమావేశాలు నిర్వహించారు. ఇందులోనే ఏకాభిప్రాయంతో కమిటీలను ఎన్నుకోవాలనుకున్నా నేతల మధ్య ఉన్న పోరుతో అది సాధ్యం కాలేదు. ఏకంగా ఎమ్మెల్యేలు జోక్యం చేసుకున్నా.. వినకుండా ఏకగ్రీవానికి అంగీకరించలేదు. ప్రస్తుతం యాదగిరిగుట్ట పట్టణం, మండలం ఏకగ్రీవమైనట్లు తెలుస్తున్నది. తొలుత తుర్కపల్లి ఏకగ్రీవం అనుకున్నా.. ఆ తర్వాత కొందరు నేతలు అభ్యంతరం చెప్పినట్లు ప్రచారం జరుగుతున్నది. అయితే జిల్లా అధ్యక్షుడిగా ఉన్న అండెం సంజీవ రెడ్డి పార్టీని నడిపించడంలో విఫలమయ్యారని, ఆయనకు నేతలకు సమన్వయం లేదని హస్తం నేతలే గుసగులాడుతున్నారు.

పాత, కొత్త నేతల ఢీ..

కాంగ్రెస్ పాత, కొత్త కాపుల మధ్య కోల్డ్ వార్ జోరుగా నడుస్తున్నది. అయితే ఎమ్మెల్యే ఎన్నికల ముందు వివిధ పార్టీల నుంచి హస్తం పార్టీలో చేరారు. ఆ సమయంలోనే వలస నేతలకు పదవులు, అవకాశాలు కల్పిస్తామని భరోసా కల్పించారు. ఇప్పుడు టైం రావడంతో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని కొత్త నేతలు పట్టుబడుతున్నారు. ఇదిలా ఉండగానే.. పాత లీడర్లు రంగంలోకి దిగుతున్నారు. అధికారంలో లేకున్నా పార్టీని అంటిపెట్టుకొని జెండా మోశామని, తమను కాదని వేరే వాళ్లకు ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అధిక సంఖ్యలో ఆశావహులు బరిలో నిలుస్తున్నారు. గుండాలలో 22 మంది, బొమ్మల రామారంలో 22 మంది బరిలో నిలిచారు. ఆలేరు పట్టణం, మండలం, మోటకొండూరు, ఆత్మకూరు(ఎం)లోనూ పదులు సంఖ్యలో బరిలో ఉన్నారు. అయితే బరిలో నిలిచిన ఆశావహులను ఉపసంహరింపజేసేలా ఎవరికి వారే ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

గుండాలలో రచ్చరచ్చ..

గుండాల, మే 26: గుండాల కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు రోజు రోజుకు ముదురుతున్నాయి. ఇటీవల టీపీసీసీ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం కసరత్తు మొదలైంది. అందులో భాగంగానే ఈ నెల 21న గుండాల మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ సభ్యులు లకావత్ ధన్వంతి, పులి అనిల్ కుమార్, యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డిలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి నామినేషన్లు తీసుకునే వరకు సీన్ ఒకలా ఉంటే నామినేషన్ల తదుపరి సీన్ ఎవరికి వారుగా అనుకూలంగా మార్చుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి కోసం 18 మంది తమ నామినేషన్లు అందించగా. ముగ్గురు నాయకులు ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం తమ నామినేషన్లను సమర్పించారు. ప్రస్తుతం మండల అధ్యక్షుడిగా ఉన్న ఏలూరి రాంరెడ్డి తన పదవిని కొనసాగించాలని.. లేదంటే తాను సూచించిన వ్యక్తికే మండల అధ్యక్ష పదవిని కట్టబెట్టాలని అధ్యక్ష పదవికి నామినేషన్ వేసిన ఆశావహులతో సంతకాల సేకరణలో నిమగ్నమయ్యారు. 14 మంది తనకు మద్దతు తెలుపుతున్నారని వారి మద్దతు తనకే ఉందంటూ సంతకాలతో కూడిన లేఖను డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డికి లేఖను సమర్పించినట్లు సమాచారం. మరోవైపు ఉమ్మడి నల్లగొండ ఆల్డా మాజీ డైరెక్టర్ ఇమ్మడి దశరథ గుప్తా సైతం అధ్యక్ష పదవి రేసులో తన మద్దతుదారులతో ముందుకు సాగుతున్నారు. ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న ఈరసరపు యాదగిరి గౌడ్‌తో పాటుగా మరో ముగ్గురు నేతలు నామినేషన్ దాఖలు చేశారు. డీసీసీ అధ్యక్షుడి పదవికి గుండాలకు చెందిన ఓ నాయకుడు పోటీలో ఉంటున్నట్లు ఇటీవలే సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుకు జత చేస్తూ.. ఏలూరి రాంరెడ్డి 'తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం అంటే ఇదే' అంటూ రీపోస్టు చేశారు.



సోమవారం ఏపూరు ఐకేపీ కేంద్రంలో వడ్లను పరిశీలించి సమస్యలు తెలుసుకుంటున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

రాష్ట్రంలో దొంగలు పడ్డారు

ఎవరికి దొరికింది వారు దోచుకుంటున్నారు

కాంగ్రెస్ పాలనలో రైతాంగానికి తీవ్ర అన్యాయం: జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్, మే 26: రాష్ట్రంలో దొంగలు పడ్డారని.. ఎవరికి దొరికింది వారు దోచుకుంటున్నారని ఇందులో సీఎం, మంత్రులు ఎవరి దోపిడీ వాళ్ల దేనని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం ఏపూరు ఐకేపీ సెంటర్‌లో తడిసి మొలకెత్తిన వడ్లను సోమవారం పరిశీలించి మాట్లాడారు. రైతులంతా తమ సమస్యలు పరిష్కరించాలని ఆయనకు మొర పెట్టుకున్నారు. రెండు నెలలవుతున్నా ధాన్యాన్ని కాంటా వేయకపోవడం దురదృష్టకరమన్నారు. వడ్లు ముక్కి మొలకలు వస్తున్నాయని, 60 రోజులైనా వడ్లు కొనలేదంటే ఇంత కంటే దారుణం ఏముంటుందని ప్రశ్నించారు. ఐకేపీ కేంద్రాల్లో ఫార్‌బాయిల్డ్ వాసనలు వస్తున్నాయన్నారు. నీళ్లు రాక అరకొరగా పండిన పంట మొలకలు వచ్చాయన్నారు. రుతు పవనాలు వచ్చి దుక్కి దున్నాల్సిన రైతు ధాన్యం కుప్పల వద్ద కాపలా కాయాల్సి వస్తుందన్నారు. కాంటా అయ్యాక మిల్లుల్లో రైతులతో బేరాలాడుతున్నారని, రెండు మూడు రోజులకోసారి వచ్చే లారీలు, సరిపడా గోనె సంచులు లేక రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన చెందారు. రైతులు దళారుల కాళ్లు పట్టుకునే దుస్థితి దాపురించిందని, రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అన్యాయం చేసిందన్నారు. గింజ లేకుండా వెంటనే కొనుగోలు చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ వారికి నెలలు గడుస్తున్నా కాంటా వేయడం లేదని విమర్శించారు. మాజీ మంత్రి వెంట మాజీ ఎంపీ బడగుల లింగయ్యయాదవ్, నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు తూడి నరసింహారావు, మర్ల చంద్రారెడ్డి, బ్రహ్మం, బాలసైదులు, పుట్ట కిశోర్, భిక్షం, జీవన్‌రెడ్డి, మల్లారెడ్డి, దామిడి శ్రీను, బషీర్, సోమిరెడ్డి, వెంకటరెడ్డి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపూరులో విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం



నల్లగొండలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నీలగిరి, మే 26. భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర చాలా కీలకమైందని నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో లైసెన్స్ సర్వేయర్ల ధ్రువీకరణపత్రాల పరిశీలన, సామగ్రి పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 28 నుంచి సుమారు 50 రోజులు(పని రోజులు) లైసెన్స్ సర్వేయర్లకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించిన సర్వే ఎఫ్ లైన్ వంటి సర్వేల సమయంలో సర్వేయర్లు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేకించి రెవెన్యూకు చెందిన గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారం కోసం నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో మీసేవ ద్వారా 819 మంది దరఖాస్తు చేసుకోగా మొదటి విడతగా 409 మంది ధ్రువీకరణ పత్రాలు పరిశీలించామని, ఆగస్టులో మరో 410 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సర్వేల్యాండ్ రికార్డ్స్ ఇన్‌చార్జి ఏడీ సుజాత, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్లు రమణయ్య, సూపరింటెండెంట్ రాధాకృష్ణ ఉన్నారు.

గ్రీవెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్..

ప్రజావాణిలో భాగంగా కలెక్టర్ ఇలాత్రిపాఠి కలెక్టరేట్‌లో బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఆయాశాఖల అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణఅమిత్, రాజ్‌కుమార్, డీఆర్ఏ శ్రోత్‌రెడ్డి, డీఆరీవో శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఉద్యమంలో టీజేఎఫ్ పాత్ర కీలకం



టీజేఎఫ్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, మే 26 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం కీలక పాత్ర పోషించిందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఈ నెల 31న హైదరాబాద్‌లో జరగనున్న టీజేఎఫ్ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జర్నలిస్టులంతా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నిర్భయంగా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణాపై పక్క రాష్ట్రాలు చేస్తున్న కుట్రలను ఎండగట్టాలని కోరారు. టీజేఎఫ్ రజతోత్సవ సభ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మారిపెద్ది శ్రీనివాస్, జర్నలిస్టులు వజ్జె వీరయ్య, పి.సైదిరెడ్డి, చల్లా చంద్రశేఖర్, ఫణీంద్ర, సురేష్, గోవర్ధన్, శ్యాంసుందర్‌రెడ్డి, అమరగాని నాగేందర్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొనుగోలులో జాప్యం.. మొలకెత్తుతున్న ధాన్యం

జాజిరెడ్డిగూడెంలోని ఉమామహేశ్వర రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం

అర్వపల్లి మే 26:: కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టడం లేదంటూ అధికారుల తీరుపై రైతులు మండిపడుతున్నారు. అకాల వర్షాలకు వడ్లు తడిసి మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు బస్తాకు రెండు కేజీల వడ్లను తరుగు పేరుతో తీసేస్తున్నారు. ఇంచార్జిగా ఉండే కొంతమంది వ్యక్తులు కాంటా అయిపోయిన తర్వాత రైతుల నుంచి తమకేం లేదా అంటూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 25 కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి వడ్లు పోసి ఎప్పుడు కొంటారో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలు ఎంచుకోవాలి

పాలిసెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ శ్రీజను అభినందిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్, మే 26 : విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. పాలిసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన నూతనకల్ మండలం మిర్యాలకు చెందిన శ్రీజను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించి మాట్లాడారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాధ్యత వారసులదేనని, విస్మరించినట్లు ఫిర్యాదులు వస్తే చట్టపరంగా చర్యలు తప్పని జిల్లా ఎస్పీ నరసింహ హెచ్చరించారు. పోలీసు ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, విద్యార్థిని తండ్రి మధుసూదన్‌రావు, స్నేహితులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 13 మంది విద్యార్థుల డిబార్

రామగిరి, మే 26: ఎంజీయూ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన 6వ సెమిస్టర్ పరీక్షల్లో 13 మంది విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా ఆయా పరీక్షల కేంద్రాల్లోని స్క్వాడ్ బృందాలు డిబార్ చేసినట్లు సీవోఈ డా. జి ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. కాగా పరీక్షలకు 5,090మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4,708మంది విద్యార్థులు హాజరుకాగా 369మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. వీరిలో భువనగిరిలోని స్టాన్‌ఫర్డ్ ఉమెన్స్ కళాశాలలో 4, తిరుమలగిరి ప్రగతి డిగ్రీ కళాశాలలో 1, దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1, భవిత డిగ్రీ కళాశాలలో 1, సూర్యాపేట ఆర్‌కేఎల్‌కే డిగ్రీ కళాశాలలో 1, రాకేశ్ బీఈడీ కళాశాలలో 3, మిర్యాలగూడ హసిత ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో 1 , కోదాడలోని త్రివేణి డిగ్రీ కళాశాలలో 1 డిబార్ అయ్యారు.

మోసాలకు పాల్పడుతున్న కిలాడి లేడి అరెస్ట్

మిర్యాలగూడ, మే 26: ఐఏఎస్ అధికారిణి అంటూ పలుచోట్ల మోసాలకు పాల్పడుతున్న కిలాడి లేడిని మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మోతీరాం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లావుడితండాకు చెందిన సరిత అలియాస్ ప్రత్యూష డాక్టర్ ప్రత్యూష ఐఏఎస్‌గా చలామణి అవుతూ పలుచోట్ల యువకులకు వల వేసేది. ఏడాది క్రితం ఓ వైద్యుడిని బ్లాక్ మెయిల్ చేసి రూ.5లక్షలు వసూలు చేసింది. అదేవిధంగా విద్యార్థిని ముసుగులో హాస్టళ్లలో ఉంటూ అమ్మాయిల దగ్గర నగదు, మొబైల్ ఫోన్లు చోరీ చేసేదని తెలిపారు. ఒకవైపు ఐఏఎస్ అధికారిణంటూ, మరో చోట డీఎస్పీ కూతురునంటూ, డీఎస్పీ సతీమణినంటూ అమాయకులను బోల్తా కొట్టించింది. డబ్బున్న వారినే టార్గెట్ చేస్తూ యువకులను ట్రాప్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నది. సరితపై మలక్‌పేట, చైతన్యపురి, ఉప్పల్, నల్లగొండ టూటౌన్, మిర్యాలగూడ వన్‌టౌన్ పరిధిలో పలుచోరీ కేసులు, నార్కట్‌పల్లి, నల్లగొండ వన్‌టౌన్ పరిధిలో చీటింగ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆమెపై మూడు కేసులు నమోదు చేసి ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన తల్లిదండ్రులు అనాథలైన పిల్లలు

చౌటుప్పల్ రూరల్, మే 26: కుటుంబ కలహాలతో ఇటీవల భార్య ఆత్మహత్య చేసుకున్న కొద్దిరోజులకే భర్త బలవన్మరణానికి పాల్పడడంతో వారికి పుట్టిన పిల్లలు అనాథలుగా మిగిలారు. పోలీసులు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం కోయిలగూడానికి చెందిన గోశిక భాస్కర్ (40) చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి అదే గ్రామానికి చెందిన నవ్యతో వివాహం జరిగింది. వీరికి సుభాష్(8)మహాలక్ష్మి (4) ఇద్దరు పిల్లలు ఉన్నారు. నవ్య దశదినకర్మ జరిగి మూడు రోజులు కావస్తుంది. భాస్కర్ మనస్తాపానికి గురై సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భాస్కర్ మృతికి నవ్య బంధువులే కారణమని తల్లి సత్తమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి అదనపు కలెక్టర్

నీలగిరి, మే26. నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సెలవుల్లో వెళ్లడంతో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా నారాయణ అమిత్ పనిచేస్తున్నారు. సెలవులు ముగిసిన శ్రీనివాస్ విధుల్లో చేరడంతో ఆయనను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేయడంతో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా ఉన్న రాజ్‌కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.